
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
12-10-2026 (Monday)
MAIN EDITION

రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు



అక్షరటుడే, న్యూ ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం, కేంద్ర దర్యాప్తు సంస్థలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈడీ, సీబీఐ , ఫారెన్ట్రీ విభాగాలకు చెందిన దాదాపు 200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు ప్రస్తుతం తమతో సంప్రదింపుల్లో ఉన్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పోరాటం కేవలం నరేంద్ర మోదీకి, తనకు మధ్య జరుగుతున్న వ్యక్తి గత సమరం కాదని రాహుల్ స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తును, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసమే ఈ యుద్ధమని వ్యాఖ్యానించారు.

తగ్గనున్న మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ ధరలు!



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ, మెట్రోలో ప్రయాణించే వారి కోసం ప్రభుత్వం కామన్ పాస్ తెచ్చిన విషయం తెలిసిందే. అయితే దీని ధరలు భారీగా ఉన్నాయని విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ధరలు తగ్గించాలని యోచిస్తున్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన మేరకు, ధరలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చే అంశంపై త్వరలోనే అధికారులతో సంప్రదింపులు జరుపుతామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఐపీవోకు అగ్నిమాపక పరికరాల తయారీ కంపెనీ



అక్షరటుడే, బిజినెస్‌డెస్క్: అగ్నిమాపక పరికరాల తయారీలో సుమారు 30 ఏళ్ల అనుభవం ఉన్న హెచ్డీ ఫైర్ ప్రొటెక్ట్ కంపెనీ ఐపీవోకు వస్తోంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 712.31 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరు ధరను రూ. 258 నుంచి రూ. 271 లుగా నిర్ణయించింది.

టయోటా గ్లాంజా ఫేస్‌లిఫ్ట్ టీజర్ విడుదల..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: 'టయోటా కిర్లోస్కర్ మోటార్' తమ పాపులర్ మోడల్ 'గ్లాంజా'లో సరికొత్త అప్‌డేట్లతో ఫేస్‌లిఫ్ట్ వర్షన్‌ను పరిచయం చేయడానికి సిద్ధమైంది. అక్టోబర్ 14, 2026న అధికారికంగా మార్కెట్లోకి రానున్న ఈ కొత్త గ్లాంజాకు సంబంధించిన టీజర్‌ను కంపెనీ సోషల్ మీడియాలో విడుదల చేసింది.

నిరసనకు తేదీ, సమయం మీరే చెప్పండి



అక్షరటుడే, ఢిల్లీ: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు తమకు అనుమతి నిరాకరించడంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ సమయంలో నిరసన చేయాలో పోలీసులే నిర్ణయించి చెప్పాలని, ఇందుకోసం వారికి 24 గంటల సమయం ఇస్తున్నామని ఆ పార్టీ నేత సౌరవ్ దాస్ అన్నారు.

పంజాబ్‌లో మరో పోలీస్ హత్య



అక్షరటుడే, పంజాబ్ : పంజాబ్‌లో మరో పోలీసును దుండగులు హత్య చేశారు. నౌషెహ్రా పన్నూనాలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు పోలీస్ అసిస్టెంట్ సబ్‌ఇన్స్పెక్టర్‌ను కాల్చి చంపారు. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని మఖులో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై ఇక్బాల్ సింగ్ ఇంటికి వస్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు దాడి చేశారు. అతి సమీపం నుంచి పలుమార్లు కాల్పులు జరిపారు. వాటిలో రెండు బుల్లెట్లు ఇక్బాల్ సింగ్ శరీరంలో నుంచి దూసుకెళ్లాయి. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు ఆస్పత్రి కి తరలించగా.. అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు.

కోర్టు ద్వారాలు తెరిచే ఉన్నాయి : సీజేఐ



అక్షరటుడే, ఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం సుప్రీం కోర్టుకు మార్చ్ కూటమి నాయకులు పిలుపునిచ్చారు. అంతేగాకుండా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను కలవాలని అనుకున్నారు. దీనిపై సీజేఐ స్పందించారు. సుప్రీంకోర్టు తలుపులు ప్రతి ఒక్కరికీ తెరిచి ఉన్నాయని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ప్రతి పక్ష కూటమి నాయకులను కలవడానికి ఆయన ఆసక్తి చూపలేదు. ఈ విషయం ఇప్పటికే సబ్ జడ్జిగా ఉన్నందున వారు పిటిషన్ దాఖలు చేయడం ద్వారా కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేశారు.



ఎస్ఐఆర్‌తోనే బీజేపీ గెలుపు

దేశంలో ఎస్ఐఆర్ అమలైన రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎస్ ఐఆర్ అమలు చేయని రాష్ట్రాల్లో ఇతర పార్టీలు గెలుపొందుతు న్నాయని చెప్పారు. ఏఐసీసీ చలో ఢిల్లీ పిలుపు మేరకు సీఎం, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ, ఐటీలను వాడిందన్నారు. ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించి అధికారంలోకి రావడానికి యత్నిస్తోందన్నారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ఏపీలో నిర్వహణకు అనుమతి ■హైకోర్టు తీర్పు ప్రకారమే ఎలక్షన్ ■'సర్' పూర్తయితే కొత్త జాబితా ■లేకపోతే పాత జాబితాతో ఎన్నికలు

బీజేపీని వ్యతిరేకించే వారి ఓట్లను తొలగిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీనికి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వం వహిస్తున్నారన్నారు. తాజాగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనను మరో స్వాతంత్ర్య పోరాటంగా ఆయన అభివర్ణించారు. 13 కోట్ల మంది భారత పౌరుల హక్కులను కాపాడే స్వాతంత్ర్య పోరాటం అన్నారు. కోట్ల మంది దేశ పౌరులకు తమ హక్కులను దూరం చేసి, మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోందన్నారు. గతంలో భగత్‌సింగ్ నేతృత్వంలో వినిపించిన 'సైమన్ గో బ్యాక్' నినాదం దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ఊతమిచ్చిందని, ప్రస్తుతం రాహుల్ గాంధీ నేతృత్వంలో 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' అనే నినాదం వినిపిస్తోందని పేర్కొన్నారు. ఈ నినాదంతో బీజేపీ నుంచి భారతదేశానికి విముక్తి లభించే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు.

దారి తప్పిన ఎస్ఐఆర్

దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కాంగ్రెస్ కీలకపాత్ర పోషించిందని సీఎం అన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రతీ భారతీయుడికి ఓటు హక్కు వచ్చిందన్నారు. అంబేడ్కర్ ఎంతో అధ్యయనం చేసి ఓటు హక్కును రాజ్యాంగంలో చేర్చారు. ఓటు హక్కు ఇచ్చేందుకే నాడు ఎస్ ఐఆర్ ప్రక్రియ చేపట్టారని, అప్పట్లో మంచి ఉద్దేశంతో ప్రారంభమైన ఎస్ఐఆర్ ఇప్పుడు దారి తప్పిందన్నారు. ప్రజల సమస్యల కోసం పోరాటం చేసిన పార్టీలు కాంగ్రెస్, సీపీఐ మాత్రమేనని పేర్కొన్నారు. అధికారం కోసమే కొన్ని పార్టీలు పుట్టాయని, ఎస్ఐఆర్ ప్రక్రియతో కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు.



సౌదీ ఎయిర్‌పోర్టుపై మరోసారి దాడి


అక్షరటుడే, నేషనల్ డెస్క్: సౌదీ అరేబియాలోని మరో ఎయిర్ పోర్టుపై హౌతీ రెబల్స్ క్షిపణులతో విరుచుకుపడ్డారు. కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ ఎయిర్ పోర్టుపై ఆదివారం అర్ధరాత్రి దాడి చేశారు. యెమెన్‌కు చెందిన హౌతీ గ్రూపు శనివారం రాత్రి జరిపిన క్షిపణి దాడిలో 13 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్ 4పై క్షిపణి పడటంతో మంటలు చెలరేగి, ఒక వ్యక్తి మరణించాడు. ఈ ఘటనలో మరో 11 మంది గాయపడ్డారు.

బాంబు దాడిలో హైదరాబాద్ వాసి మృతి



అక్షరటుడే, నేషనల్ డెస్క్: సౌదీ అరేబియాలో జరిగిన బాంబు దాడి హైదరాబాద్‌లోని ఒక కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పవిత్రమైన ఉమ్రా యాత్ర కోసం కుటుంబసమేతంగా వెళ్లిన నగరానికి చెందిన ఐటీ ఉద్యోగి మహమ్మద్ యూసుఫ్ (46) ఈ దాడిలో దుర్మరణం పాలయ్యారు. సౌదీ అరేబియాలో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్న మహమ్మద్ యూసుఫ్, తన భార్య , ముగ్గురు పిల్లలతో కలిసి ఉమ్రా యాత్రకు వెళ్లారు. అక్టోబర్ 10న రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మదీనాకు వెళ్లేందుకు వారు వేచి చూస్తుండగా ఒక్కసారిగా బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోగా, శిథిలాలు తగలడంతో యూసుఫ్ అక్కడిక్కడే మృతి చెందారు. ఆయన భార్య, పిల్లలు, మరికొందరు బంధువులకు తీవ్ర గాయాలయ్యాయి.

కారు ఢీకొని ముగ్గురి మృతి



అక్షరటుడే, నేషనల్ డెస్క్: కేరళలోని కొచ్చిన్‌లో ప్రమాదంలో ముగ్గురు మరణించారు. మద్యం మత్తులో ఉన్న 19 ఏళ్ల యువకుడు మినీ కూపర్‌తో ఒక బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వయనాడ్‌కు చెందిన దేవిక (21), పాలక్కాడ్‌కు చెందిన గోపిక (22) దక్షిణ కన్నడ ప్రాంతానికి చెందిన ఇజాజ్ (21)గా గుర్తించారు. నిందితుడిని సుహైల్‌గా గుర్తించారు. నిందితుడు ప్రమాదం అనంతరం కనీసం పశ్చాత్తాపం లేకుండా మాట్లాడాడు. బాధ లేకుండా తన తండ్రి చూసుకుంటాడని చెప్పాడు.

భారత అమ్ముల పొదిలో చేరిన 'ఐఎన్ఎస్ మంగ్రోల్'



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : భారత నౌకదళం మరింత పటిష్టం కానుంది. మూడో జలాంతర్గామి నిరోధక యుద్ధ నౌక ఐఎన్ ఎస్ మంగ్రోల్ జల ప్రవేశం చేసింది. దీంతో తీరప్రాంత జలాల్లో నౌకాదళం జలాంతర్గామి నిరోధక యుద్ధ సామర్థ్యం మరింత బలోపేతం కానుంది. కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించిన ఈ నౌక, జలాంతర్గామి ముప్పులను గుర్తించి, ఎదుర్కోవడానికి సముద్ర గస్తీ విమానాలు, హెలికాప్టర్లు, ఇతర యుద్ధనౌకలతో కలిసి పని చేస్తుంది. మారుతున్న సముద్ర భద్రతా వాతావరణంలో పెరుగుతున్న జలాంతర్గామి ముప్పుల నేపథ్యంలో, మంగ్రోల్ నౌక తీరప్రాంత జలాల్లో భారత నౌకాదళం జలాంతర్గామి నిరోధక యుద్ధ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది.

మహారాష్ట్రలో ఆందోళన విరమించిన నిరుద్యోగులు



అక్షరటుడే, మహారాష్ట్ర: ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 10 రోజులుగా మహారాష్ట్రలో ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు శాంతించారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. నియామక సంస్థలో అవకతవకలపై విచారణ జరిపేందుకు, సీనియర్ ఐఏఎస్ అధికారి తుకారాం ముండేను కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం కమిటీ వేసింది. విచారణ పూర్తయ్యే వరకు తాను సెలవుపై వెళ్తున్నట్లు మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ వివేక్ భీమస్వర్ ప్రకటించారు. దీంతో ఆందోళనకారులు నిరసన విరమించారు.

బొల్లారం చిన్నారి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



అక్షరటుడే, సికింద్రాబాద్ : సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారంలో ఇటీవల చిన్నారిని కిడ్నాప్ చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. కౌకూర్‌లో విల్లా ఆర్కిడ్స్‌లో ఐదేళ్ల చిన్నారి అరేలియా మౌజెస్‌ను సెక్యూరిటీ గార్డు కిడ్నాప్ చేసి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో బాలిక మృతదేహాన్ని సంప్‌లో గుర్తించారు. ఈ కేసు దర్యాప్తు కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గతంలోనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. తాజాగా ప్రధాన నిందితుడు విక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నారు.